క్లుప్తంగా

'వెన్నుపోటు దినం' విజయవంతంపై కృతజ్ఞతలు

కోవూరు: పట్టణంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలను మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలియజేశారు. ఈ మేరకు పట్టణంలో గురువారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అందరు నాయకులను పార్టీ మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్‌రెడ్డి అధ్వర్యంలో సమన్వయం చేసి విజయవంతం చేశారని వివరించారు.

బాబా మందిరంలో విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మందిరంలో భక్తులు భజనలు చేశారు. రాత్రి స్వామివారి పల్లకి సేవ వైభవంగా జరిగింది.

సింహ వాహనంపై అమ్మవారి విహారం



ఇందుకూరుపేట: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి అమ్మవారు సింహవాహనంపై గురువారం విహరించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు అనిల్, రామకృష్ణ, కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తలుగా కొండూరు సూరారెడ్డి, పద్మావతి దంపతులు వ్యవహరించారు.

మామపై అల్లుడి దాడి

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాల నేపథ్యంలో మామపై అల్లుడు దాడి చేసిన ఘటనపై కేసును దర్గామిట్ట పోలీసులు గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉమ్మారెడ్డిగుంటలో నివాసం ఉంటున్న గౌస్‌బాషా తన కుమార్తె సమీన్‌కు కోటమిట్టకు చెందిన అఫ్సర్‌తో గతేడాది వివాహం చేశారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం మనస్పర్థలతో కోర్టులో కేసు నడుస్తోంది. ఖాజీ కోర్టు వద్ద ఆమెపై అఫ్సర్ రెండు నెలల క్రితం దాడికి పాల్పడ్డారు. ఘటనపై చిన్నబజార్ పోలీసులకు అప్పట్లో ఆమె ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బారాషహీద్ దర్గాలో పనులు ముగించుకొని ఇంటికి గౌస్‌బాషా బుధవారం బయల్దేరారు. ప్రధాన ద్వారం వద్దకొచ్చేసరికి అఫ్సర్ అడ్డుకొని, తన చేతికున్న ఇనుప కడియంతో దాడి చేశాడు. గాయపడిన గౌస్‌బాషా జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వ్యవసాయంపై పట్టు సాధించి..

- సర్పంచ్‌గా ప్రజాసేవలో..
- మరోవైపు డ్రమ్ సీడర్‌తో వరిసాగు
- ఆధునిక పద్ధతులపై పూర్తి అవగాహన
- ఖర్చులు తగ్గుతాయంటున్న సర్పంచ్



డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలను విత్తుతున్న సర్పంచ్ ఓబుల్‌రెడ్డి

పొదలకూరు: పంచాయతీ ప్రథమ పౌరుడు సర్పంచ్. అయితే ఆయన ముందుగా ఆదర్శ రైతు. ఎడగారులో డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేపడుతున్నారు. రబీ సీజన్లో కూడా పదెకరాల్లో డ్రమ్ సీడర్‌తో సాగు చేసి దిగుబడులు సాధించారు. ఈ ఆధునిక పద్ధతిని పాటిస్తే వరినాట్లకుయ్యే ఖర్చు తగ్గిపోతుందని చెబుతున్నారు. అనేకమందికి ఆదర్శంగా నిలిచారు.

మండలంలోని దేగపూడి గ్రామ సర్పంచ్ మండి ఓబుల్‌రెడ్డి మాగాణి వ్యవసాయంలో బాగా పట్టు సాధించారు. రకరకాల వరి వంగడాలను సాగు చేస్తుంటారు. గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైనా వ్యవసాయాన్ని వదలకుండా మిగిలిన రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వరిసాగులో మితిమీరిన ఖర్చులు భరించలేక రబీలో తనకున్న పదెకరాల మాగాణిలో డ్రమ్ సీడర్‌తో నేరుగా పొలంలో విత్తనాలను విత్తి నార్లు పోయకుండా వరిని పండించారు. దీంతో సర్పంచ్‌కు ఎకరాలకు సుమారు రూ.5 వేల వరకు పెట్టుబడులు మిగిలాయి. తన కుమారుడితో కలిసి ఎడగారులోనూ పదెకరాల్లో డ్రమ్ సీడర్‌తోనే సాగు చేస్తున్నారు.

ఇలా చేస్తే..

డ్రమ్ముల్లో వరి విత్తనాలను నింపి సేద్యం చేసిన మాగాణిలో డ్రమ్ సీడర్‌ను తిప్పితే విత్తనాలు మొలకెత్తి నేరుగా వరి పండించేందుకు అవకాశం కలుగుతుంది. సాధారణంగా అనేకమంది రైతులు వరినార్లు పోసుకుని సుమారు 25 నుంచి 30 రోజులు నారును పెంచి ఆ తర్వాత నారు పెరిగి కట్టలు కట్టి కూలీల చేత నాట్లు (నారేతలు) వేయించాలి. ఇదంతా చేయాలంటే ఎకరానికి సుమారు రూ.4,500 నుంచి రూ.5 వేల వరకు ఖర్చవుతుంది. అయితే డ్రమ్ సీడర్ ఎప్పటి నుంచో ఉన్నా చాలామంది నాట్లే వేస్తున్నారు. సీడర్ ద్వారా వరి సాగు చేస్తే 4 నెలల 10 రోజులకు దిగుబడినిచ్చే పంట 20 రోజులు ముందగానే దిగుబడినిస్తుంది. అయితే ఎడగారులో ఎండలు అధికంగా ఉంటే విత్తిన విత్తు మొలకెత్తడంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వ్యవసాయాధికారులు అంటున్నారు.

దిగుబడి ఆశాజనకం



డ్రమ్ సీడర్ ద్వారా స్వయంగా నేనే వరి సాగు చేస్తున్నాను. దిగుబడి కూడా ఆశాజనంగానే ఉంది. ప్రధానంగా పెట్టుబడులు తగ్గుతున్నందున ఎడగారులోనూ డ్రమ్ సీడర్‌ను వినియోగిస్తున్నాను. ఇందువల్ల నాకు ఇబ్బందులేవి కలగడం లేదు. మారుతున్న కాలంలో వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలి.

– మండి ఓబుల్‌రెడ్డి, సర్పంచ్, దేగపూడి

ఆహ్వానించదగినదే..



డ్రమ్ సీడర్ వ్యవసాయం ఆహ్వానించదగినదే. అయితే ఎడగారులో ఈ ప్రాంతంలో మే 15వ తేదీ నుంచి నార్లు పోయడం అలవాటు. డ్రమ్ సీడర్‌తో నేరుగా విత్తితే ఉష్ణోగ్రతల వల్ల మొలకెత్తడంలో కొంత ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. ఇందువల్ల దిగుబడి తగ్గుతుందని భావిస్తున్నాం. ఈ ఎడగారులో ఎండలు తగ్గుముఖం పట్టడం వల్ల ఇబ్బందులు ఉండవనుకుంటున్నాం.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు

హామీలు నెరవేర్చడంలో కూటమి విఫలం

- సర్వేపల్లి ప్రజలకు గోవర్ధన్‌రెడ్డిపై ఎంతో అభిమానం ఉంది
- కాకాణి పూజిత



మాట్లాడుతున్న పూజిత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి హామీని నిలబెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది' అని కాకాణి పూజిత అన్నారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గానికి ఎంతో సేవ చేశారన్నారు. ఆయనపై ప్రజల్లో ఉన్న అభిమానం ఆపితే ఆగేది కాదని పేర్కొన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి నిరసన తెలిపారన్నారు. ప్రభుత్వం, అధికారులు ప్రజల సంక్షేమం కోసం పని చేయాలన్నారు. కొందరు అధికారులు పరిధి దాటి నియంతల్లా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తుంటే అడుగడుగునా ఆటంకాలు సృష్టించారన్నారు. ప్రజల సమస్యల గురించి మాట్లాడకూడదనే విధంగా కూటమి ప్రభుత్వ వ్యవహారం ఉందన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు ఉత్సాహంతో కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. అధికారులు మీడియాను కూడా అడ్డుకున్న పరిస్థితిని చూశామని, కూటమి ప్రభుత్వంలో పత్రికలకు కూడా స్వేచ్ఛగా వ్యవహరించే పరిస్థితుల్లేవా అని ప్రశ్నించారు. గోవర్ధన్‌రెడ్డిని జైల్లో పెట్టినా, కార్యకర్తలు, నాయకులను ఇబ్బందులకు గురిచేసినా, కేసులు పెడతామని భయపెట్టినా నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం సంతోషాన్నిచ్చిందన్నారు. అరెస్టులతో, కేసులతో నాన్నపై సర్వేపల్లి ప్రజలకు ఉన్న అభిమానాన్ని ఆపలేరన్నారు. నిరసన కార్యక్రమంలో అధికారులు అడుగడుగునా అడ్డుకున్నా రక్షణగా సర్వేపల్లి ప్రజలు నిలబడ్డారన్నారు. గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కార్యక్రమం చేపట్టలేదని అవహేళనతో అడ్డంకులు సృష్టించిన వారందరికీ ఈ కార్యక్రమం విజయవంతం కావడం చెంపపెట్టు అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రథమమని, నిరసనను తెలియజేయడానికి వచ్చిన వారిపై అధికారులు విరుచుకుపడటం అధికార దుర్వినియోగానికి అద్దం పడుతోందన్నారు. మా కుటుంబంపై సర్వేపల్లి ప్రజల అభిమానం మెండుగా ఉందనే విషయాన్ని గమనించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమం ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దలు ఇకనైనా ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని కోరారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా లెక్కచేయకుండా అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమాన్ని మేము చేయగలమనే నమ్మకంతో పాల్గొన్న ఎంపీలు మిథున్‌రెడ్డి, గురుమూర్తికి, వెన్నుపోటు దినం విజయవంతం కావడానికి కృషి చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు, సర్వేపల్లి ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం



పొదలకూరు: మాట్లాడుతున్న ఏడీఏ

పొదలకూరు: భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు, పురుగు మందులను వినియోగించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ మారుతీదేవి తెలిపారు. మండలంలోని తోడేరు, మొగళ్లూరు గ్రామాల్లో గురువారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నెల్లూరు కేవీకే ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ భూసార పరీక్షలను రైతులు తరచూ చేయించుకోవాల్సిందిగా సూచించారు. ఇందువల్ల భూమి ఏమి కోల్పోతుందో తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త సుజాత మాట్లాడుతూ విలువ ఆధారిత పదార్థాలు తయారు చేసుకుని స్వయం ఉపాధిని పెంపొందించుకునే మార్గాలను మహిళలకు వివరించారు. పొదలకూరు ఏఆర్ఎస్ శాస్త్రవేత్త సురేఖ మాట్లాడుతూ నిమ్మలో యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై సలహాలు, సూచనలిచ్చారు. వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త లక్ష్మీప్రసన్న వరి వంగడాలు, రైతుల మార్కెటింగ్ సమస్యలపై మాట్లాడారు. పొదలకూరు ఏఓ ఎ.వాసు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట ఎరువులను సబ్సిడీకి అందజేస్తున్నామని, అవసరమైన వారు పేర్లు నమోదు చేసుకుని నగదు చెల్లించి తీసుకోవాల్సిందిగా సూచించారు. సమావేశంలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

⇨ ఇందుకూరుపేట: తగిన మందులను సరైన మోతాదులో పిచికారీ చేస్తే అధిక దిగుబడులను పొందొచ్చని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త పరమశివ పేర్కొన్నారు. మండలంలోని పున్నూరులో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌ను ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్ర ఏడీ మాధవి, శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, వీఏఏ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట మండలంలో..

కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): పొగతోటలోని ఓ హాస్పిటల్ సమీపంలో గల కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించారు. దీనిపై రామ్మూర్తినగర్ 45 / 2 సచివాలయ వీఆర్వో సునీతకు సమాచారం అందించారు. చిన్నబజార్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు సుమారు 35 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉన్నారు. మృతుడి కుడిచేతిపై అమ్మ అనే పచ్చబొట్టుంది. జీజీహెచ్ మార్చురీకి తరలించి.. కేసు నమోదు చేశారు. మృతదేహం ఉబ్బిపోయి ఉంది. మృతి చెంది రెండు రోజులై ఉండొచ్చని భావిస్తున్నారు.

నగదు చోరీ కేసులో దర్యాప్తు ముమ్మరం

పొదలకూరు: రైతు రామకృష్ణారెడ్డికి చెందిన నగదు కాజేసిన కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బుధవారం ఘటన జరిగిన వెంటనే ముంబై ప్రాంతానికి చెందిన ఓ యువకుడిని స్థానికులతో కలిసి రైతు పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్సై హనీఫ్ గురువారం విచారణ నిర్వహించారు. బస్టాండ్‌లో సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. మరో యువకుడు బైక్ ట్యాంకర్ కవర్ నుంచి నగదు తస్కరిస్తున్నట్టుగా గుర్తించినట్టు తెలిసింది. దీంతో ముంబై ప్రాంతానికి చెందిన యువకుడు చోరీకి పాల్పడలేదని తెలుస్తోంది. దొంగ పట్టణంలోని నాగార్జున స్కూల్ సందు గుండా పరారయ్యాడని చెప్పుకొంటున్నారు. రైతు వెంబడించడంలో పొరపాటు పడ్డాడా? లేక ఇద్దరు యువకులకు ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది. వ్యవసాయ పనుల నిమిత్తం రైతు నగలను బ్యాంక్‌లో కుదువ పెట్టుకుని నగదు తీసుకువెళ్తుండగా ఈ చోరీ జరగడంతో రైతు కుటుంబం కుంగిపోయింది. పొదలకూరు పంచాయతీ బస్టాండ్‌లో తరచూ దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ రద్దీగా ఉన్న సమయంలో బేబు దొంగలు సైతం ప్రయాణికుల బేబుకు చిల్లుపెట్టి చోరీలకు పాల్పడ్డారు. బస్టాండ్‌కు వచ్చే వారు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే పోలీసులు అక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు.

కనులపండువగా కల్యాణోత్సవం



విడవలూరు: మండలంలోని పార్లపల్లిలో కొలువైన అనంత పద్మనాభస్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనులపండువగా గురువారం నిర్వహించారు. పంచామృతాభిషేకం, అర్చన, పూలంగిసేవను విశేషంగా జరిపారు. అనంతరం సంగీత కార్యక్రమాన్ని నాదప్రియ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

అశోక్‌కుమార్‌రెడ్డి, మాధురి, ఆర్కెస్ట్రా నిర్వాహకులు వరదాచార్యులు, లక్ష్మీకల్యాణి, సాయి, యానాదయ్య, అర్చకుడు కృష్ణచైతన్యాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



కొడవలూరు గ్రంథాలయంలో..



యల్లాయపాళెంలో..

కొడవలూరు: గ్రంథాలయాల్లో 40 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలకు హాజరైన విద్యార్థులకు బహుమతులను గురువారం అందజేశారు. యల్లాయపాళెంలోని గ్రంథాలయంలో వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ తదితర పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులను ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, రంగారెడ్డి ప్రదానం చేశారు. శిక్షణ శిబిరానికి హాజరైన వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ కొడవలూరులోని గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో వివిధ రకాల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను రిటైర్డ్ హెచ్ఎం వెంకయ్య అందజేశారు. లైబ్రేరియన్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

కలువాయి(సైదాపురం): కలువాయిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి షేక్ ఖాదర్‌వలీ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా టీబీ ముక్త అభియాన్ అనే అంశాన్ని ఎలా నిర్వహించాలనే విషయంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ రఘురామయ్య, ఆరోగ్య విస్తరణాధికారి బాలకొండయ్య తదితరులున్నారు.

ట్రై సైకిల్‌పై విగతజీవిగా..



నెల్లూరు(క్రైమ్): ట్రై సైకిల్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన నగర డీఎస్పీ కార్యాలయ సమీపంలోని రహదారి పక్కన చోటుచేసుకుంది. మృతుడు సుమారు 55 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉన్నారు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. జీజీహెచ్ మార్చురీకి తరలించి.. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 00018, 94403 33191 నంబర్లకు సమాచారమివ్వాలని ఇన్‌స్పెక్టర్ రోశయ్య గురువారం కోరారు.

గ్రామాల్లో 'పర్యావరణ దినోత్సవం'



కొడవలూరు: ఎన్టీఆర్ కాలనీలో..



పొదలకూరు: ముత్తుకూరులోని ఎనర్జీ కాంప్లెక్స్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న అశోక్‌కుమార్

పొదలకూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఎంపీడీఓ డీవీ నరసింహారావు పొదలకూరు పంచాయతీ చిట్టేపల్లి గ్రామ సమీపంలో మొక్కలను నాటారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు తవ్వుకున్న గుంతల గట్ల వద్ద ఎంపీడీఓ పండ్ల మొక్కలను నాటారు. కార్యక్రమంలో టీఏ వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

⇨ ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ జనరేషన్ కాంప్లెక్స్‌లో మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. కంపెనీ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ హెడ్ సునీల్‌గుప్తా పర్యవేక్షణలో ఉద్యోగులు వెయ్యి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల్లో ఇప్పటి వరకు భారీ స్థాయిలో మొక్కలను నాటడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీపీసీబీ రీజినల్ ఆఫీసర్ అశోక్‌కుమార్ పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు.

⇨ బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ఎంఈఓ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ – 2 వెంకటరత్నం, ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

⇨ కొడవలూరు: ప్లాస్టిక్‌ను పారదోలి.. పర్యావరణాన్ని కాపాడుకుందామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ఆవశ్యకతపై మండలంలోని యల్లాయపాళెం గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి పాల్గొన్నారు.

⇨ మండలంలోని పెయ్యలపాళెంలో ఆట వస్తువులు, పీపీ – 1, 2 పుస్తకాలను ప్రదర్శించి తల్లులు, పిల్లలకు సూపర్‌వైజర్ నాగభూషణమ్మ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌తో సంభవించే అనర్థాలను తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చెంచమ్మ, కృష్ణవేణి, హెల్పర్ ఇందిరమ్మ పాల్గొన్నారు.

⇨ కొడవలూరులోని ఎన్టీఆర్ కాలనీలో అవగాహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త యాస్మిన్ పాల్గొన్నారు.

⇨ నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర విద్యాసంస్థల పరిసరాలను ఎన్నెస్సెస్, ఎన్‌సీసీ విద్యార్థులు శుభ్రపర్చారు. చైర్మన్ గుణశేఖర్, వైస్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఎన్నెస్సెస్ పీఓ రవికుమార్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ సతీష్, ఏఓ గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

⇨ పర్యావరణ పరిరక్షణపై చింతచెలిక సమీపంలోని ఓవెల్ – 18, బొడ్డువారిపాళెంలోని ఓవెల్ స్కూళ్లలో అవగాహన ర్యాలీలను నిర్వహించారు. అనంతరం పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. చైర్మన్, సీఈఓ వేణు, ప్రమీల, ప్రిన్సిపల్స్ సురేష్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

⇨ కోవూరు: స్థానిక గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సందీప్‌కుమార్ మాట్లాడారు. కళాశాలకు చెందిన ఎన్నెస్సెస్ విభాగ ఆధ్వర్యంలో మొక్కలను నాటామని చెప్పారు. ఎన్నెస్సెస్ అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

⇨ ఇందుకూరుపేట: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని బీజేపీ మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరులో మొక్కలు నాటారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు నెల్లూరు శ్రీనివాసులు, శరత్, వెంకటశేషయ్య, రాంబాబు, చంద్ర, శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

⇨ వెంకటాచలం: మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: యల్లాయపాళెంలో..



కొడవలూరు: పెయ్యలపాళెంలో..



పొదలకూరు : మొక్కల నాటుతున్న ఎంపీడీఓ



కొడవలూరు: వెంకటేశ్వర విద్యాసంస్థల ఆవరణలో..



కోవూరు: గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు